ఈ రోడ్లపై ప్రయాణమెలా?

- అధ్వానంగా కట్లకుంట – తొంబరావుపేట రోడ్డు
- ప్రయాణానికి జంకుతున్న వాహనదారులు
- దశాబ్దం గడిచినా కొత్త రోడ్లు వేయని వైనం


గుంతల మయమైన కట్లకుంట - తొంబరావుపేట రోడ్డు

మేడిపల్లి: కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్డు అధ్వానంగా మారడంతో ఈ రోడ్డుపై ప్రయాణమెలా అని వాహనదారులు ప్రశ్నించుకుంటున్నారు. ఇది మేడిపల్లి మండలంలోని కట్లకుంట–తొంబరావుపేట రోడ్డు పరిస్థితి. ఈ రోడ్డు ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. కోట్లాది నిధులతో కట్లకుంట – తొంబరావుపేట రోడ్డు పదేళ్ల క్రితం నిర్మించారు. ఈ రోడ్డు వెంట వాహనాల రద్దీ ఎక్కువవడం, నిత్యం కట్లకుంట–తొంబరావుపేట మీదుగా మోరపెల్లి, జగిత్యాల వైపు వాహనాల రవాణా పెరగటంతో రోడ్డు వేసిన కొన్నాళ్లకే పెద్ద గుంతలు ఏర్పడి, కంకర తేలి అధ్వానంగా మారింది. ప్రస్తుతం నిత్యం ఈ రోడ్డుపై ఏదో ఒక ప్రమాదం సంభవిస్తూనే ఉంది. వాహనదారులకు ఈ రోడ్డు పై ప్రయాణం చేయాలంటేనే చుక్కలు కనబడుతున్నాయి. రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు గుండ్లపల్లి, పోరుమల్ల, మోరపెల్లి మీదుగా ప్రయాణం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా... పట్టించుకునే నాథుడే లేడు. సోషల్‌మీడియా వేదికగా ఈ రోడ్డుపై రకరకాల మీమ్స్, జోకులు వేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కట్లకుంట జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు గుంతల రోడ్లపై సైకిళ్లపై వెళ్లలేక కాలినడకన వెళ్తున్నారు. భారీ వర్షాలు పడ్డ రోజు రోడ్డు బురదగుంటల మారడంతో స్కూల్‌కి వెళ్లడంలేదు. దీంతో పాటు కట్లకుంట అడ్డ రోడ్డు నుంచి పోరుమల్లకు వెళ్లే 2.5 కిలోమీటర్ల రోడ్డు పరిస్థితి ఇలానే ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు కొత్తగా నిర్మించి ఇబ్బందులు తీర్చాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బండ్లు పాడవుతున్నాయి



ఇంత అధ్వాన రోడ్డుని ఎక్కడ చూడలేదు. ఈ రోడ్డు కన్నా మట్టి రోడ్డు చాలా నయం. ఈ రోడ్డుపై బండి నడుపాలంటే తాతలు కనబడుతున్నారు. గుంతలు పడి, కంకర తేలి దారుణంగా తయారైంది.బండ్లు కరాబ్ అవుతున్నాయి. ఈ రోడ్డుపై వాహనాలు నడపడంతో నడుంనొప్పులు మొదలయ్యాయి. త్వరగా నూతన రోడ్డు వేయాలి.

– చిట్టిడి జీవన్‌రెడ్డి, గ్రామస్తుడు, తొంబరావుపేట

రాకపోకలకు ఇబ్బంది



రోజు మా గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కట్లకుంట జిల్లా పరిషత్ పాఠశాలకు విద్యార్థులు కాలినడకన, మరికొందరు సైకిళ్లపై వెళ్తుంటారు. వర్షాలు పడ్డా ప్రతిసారి విద్యార్థులు స్కూల్‌కి వెళ్లడంలేదు. కారణం మా ఊరు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. గుంతలు పడి, బురద ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. ఇప్పుడు వర్షాకాలం కావడంతో తల్లిదండ్రులే విద్యార్థులను స్కూల్‌లో దింపి వస్తున్నారు.

– మహమ్మద్ నమీర్, తొంబరావుపేట



సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి - సారంగాపూర్ గ్రామాల మధ్య 16 ఏళ్ల క్రితం నిర్మించిన తారు రోడ్డు పై నిర్వాహణ లేక కంకర తేలి, రోడ్డంతా గుంతలమయమైంది. ద్విచక్రవాహనాలు కూడా నడవలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు పనులకు ఏడాదిన్నర కింద ప్రభుత్వం రూ.1.40 కోట్లు మంజూరు చేసింది. అయినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేందర్, ఏఈ, సారంగాపూర్, సెల్ నంబర్:7702353270

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

ఎంపీని కలిసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


ఎంపీ మల్లు రవితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: నాగర్‌కర్నూల్ ఎంపీ, పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవిని తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగిత్యాల నియోజకవర్గంపై చర్చించారు. ఆయన వెంట నాయకులు అడువాల లక్ష్మణ్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ


ఇళ్లకు భూమిపూజ చేస్తున్న జలపతిరెడ్డి

మల్లాపూర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేసి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇండ్లు అన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వనసంరక్షణ సమితి చైర్మన్ సిరిపురం రవీందర్, కాంగ్రెస్ నాయకులు ఎర్ర భూమయ్య, మాట్ల సోమయ్య, గొట్టిపడుత రమేశ్, బోండ్ల శంకర్, నల్ల ఏకాంబర్, బోదాసు నర్సారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రవేశాలకు ఇంటింటి సర్వే


ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

కోరుట్లరూరల్: పట్టణ శివారులోని మాదాపూర్ కాలనీలో నూతన పాఠశాల ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నూతన పాఠశాలలో ప్రవేశాల కోసం అధికారులు, విద్యా కమిటీ సభ్యులు విద్యార్థుల కోసం సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు,సత్యనారాయణ రావు, దేవేందర్,గంగాధర్, మాన్విత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ వాగ్దేవీ పాఠశాల విద్యార్థులు విఘ్నేష్, జేమ్స్, ఆర్యన్, గౌతమ్, మాధవ్, అజయ్ జాతీయ స్థాయి టెన్నిస్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లలో ఈ నెల 11,1,2,13న నిర్వహించిన సౌత్‌జోన్ టెన్నిస్ క్రికెట్ పోటీలకు అండర్–14, అండర్–17 విభాగాల్లో పాల్గొని, తమిళనాడు రాష్ట్రంపై విజయం సాధించారు. రాష్ట్రం తరఫున పాల్గొని, విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పోకల నరేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

కొడిమ్యాల: బాల్యవివాహాలతో జరిగే అనర్థాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించి చైతన్యం కలిగించాలని సహాయ వేల్ఫేర్ అసోసియేషన్ ఎన్జీవో మండల ఇన్‌చార్జి లహరి అన్నారు. మండలంలోని నాచుపల్లిలో పల్లె దవాఖాన వద్ద సహాయ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు భారతదేశ అభివృద్ధికి అడ్డుకట్టని బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అర్చన, ఏఎన్‌ఎం మహేశ్వరి, మమత, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాయికల్: పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాయికల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంతడుపుల గంగారాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, మండల అసోసియేట్ అధ్యక్షుడు అభయ్ రాజ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బొమ్మకంటి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు

సారంగాపూర్: ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ (స్టేట్ టీచర్స్ యూనియన్) జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుద్దాల శ్రీధర్, భూక్య మురళి, జోగ రవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు గుండెల నరేష్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి పెండింగ్ డీఏలను విడుదల చేయాలని టీపీటీఎఫ్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల గోవర్ధన్ అన్నారు. బీర్‌పూర్ మండలంలోని పలు పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు గొడుగు రఘుపతి యాదవ్, మండల బాధ్యులు పాల్గొన్నారు.

మేడిపల్లి: భీమారం మండలంలోని రంగాపూర్, భీమారం, మన్నెగూడెం, దేశాయిపేట, గోవిందారం, మోతుకురావుపేట్, వెంకటరావుపేట్, రాజలింగంపేట్ పాఠశాలల్లో పీఆర్‌టీయూ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనందరావు మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి ఎంపీ, బండి సంజయ్ విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ భీమారం మండల అధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాకేశ్, రాష్ట్ర కార్యదర్శులు రాజేందర్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

వెల్గటూర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూటీఎస్ సంఘం ముందు వరుసలో ఉంటుందని సంఘం అధ్యక్ష కార్యదర్శులు నిమ్మ రవి, జోగం శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎండపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మామిడి సంతోష్, జిల్లా కార్యదర్శి ధర్మేందర్, నాయకులు పాల్గొన్నారు.

సహస్ర లింగాల దేవాలయంలో అన్నపూజ



జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస లోని సహస్ర లింగాల దేవాలయంలో సోమవారం ఘనంగా అన్నపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సోమేశ్వర కొండపై భక్తుల సందడి

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై సోమవారం భక్తుల సందడి నెలకొంది. శ్రీ కనక సోమేశ్వర స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చి కోనేరులో పుణ్యస్నానమాచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఆలయ అర్చకులు బల్యపెల్లి ప్రభాకర్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కారాం, సభ్యులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

కొడిమ్యాల: యువత రాజకీయాల్లోకి రావాలని, అలాంటి వారికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే సత్యం అన్నారు. కొడిమ్యాలలో పర్యటించిన ఆయన, సోషల్ వెల్ఫేర్ సంస్థ నుంచి స్వయం ఉపాధి పథకానికి ఎంపికైన ఇద్దరు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల నియంతృత్వ పాలన లో చేసిన అభివృద్ధి ఏడాది లో కాంగ్రెస్ సర్కార్ చేసిందన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నగేష్, చొప్పదండి మార్కెట్ కమిటి చైర్మన్ మహేష్, ప్యాక్స్ చైర్మన్ రాజ నర్సంగారావు, నాయకులు బత్తిని శ్రీనివాస్, ముత్యం శంకర్, చిలువేరి నారాయణ ఉన్నారు.


ప్రొసీడింగులు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

తీన్మార్ మల్లన్నపై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

జగిత్యాలరూరల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న బేషరతుగా క్షమాపణ చెప్పాలని జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, కల్లెడ సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం తీన్మార్ మల్లన్నపై జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సదాకర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరావు, ప్రవీణ్, లక్ష్మణ్, శంకర్, గంగాధర్ పాల్గొన్నారు.

రాయికల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వాఖ్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాయికల్ మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులు రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేశ్, ఎలిగేటి అనిల్, తదితరులు పాల్గొన్నారు.


రూరల్ ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సారంగాపూర్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం సారంగాపూర్, బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కొల్ముల రమణ, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల పార్టీ అధ్యక్షులు తేలు రాజు, నేరెళ్ల సుమన్‌గౌడ్,తదితరులు ఉన్నారు..

'తీన్మార్ మల్లన్నపై దాడి సరికాదు'

కథలాపూర్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి నాయకులు దాడి చేయడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం కథలాపూర్‌లో మాట్లాడారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బీసీ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకొని బీసీలకు అన్యాయం చేయాలని చూస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో ఏమి చేయలేదన్నారు. బీసీలను స్వార్థ రాజకీయాలకు వాడుకోవాలనే భావనలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఉన్నారని దుయ్యబట్టారు. తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడులకు పాల్పడటం జాగృతి నాయకులకు తగదన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైయినేజీ


కూలిపోయిన డ్రైయినేజీ

ధర్మపురి: మండలంలోని దొంతాపూర్ శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం వద్ద డ్రైనేజీ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆరెపెల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సు రాకపోకలు నిలిచిపోయాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి గుండా నిత్యం ఇసుక ట్రాక్టర్లు, అధికలోడుతో వాహనాలు వెళ్లడంతో డ్రైనేజీ ధ్వంసమై కూలిపోయిందని గ్రామస్తులు తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా రెండు మూడు రోజుల్లో మరమ్మతులు చేపడుతామని తెలిపారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

మల్లాపూర్: పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో లబ్ధిదారులకు ఆయన కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ. 36 వేలు విరాళం

కథలాపూర్: కథలాపూర్ మండలం చింతకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం స్థానిక వ్యాపారి అంబల్ల శ్రీనివాస్ రూ. 36 వేలు విరాళంగా సోమవారం అందించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో ప్రైవేట్‌గా ఉపాధ్యాయులను నియమించుకోవడానికి రూ. 36 వేలు ఆయన అందించారు. పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం అందించడంపై హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

మల్యాల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా బీఆర్ఎస్ విజయం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు. కేసీఆర్ పాలనతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అరవై ఏళ్లుగా నోచుకోని అభివృద్ధి ఐదేళ్లలో చేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీలత, రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'భూకబ్జాదారుడిగా ఆరోపించడం సరికాదు'

మల్లాపూర్: అధికార పార్టీ నేతలు తనపై భూకబ్జాదారుడిగా ఆరోపణలు చేయడం సరికాదని రైతుబంధు కమిటీ మాజీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య (డీలర్) అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో మాట్లాడారు. దేవ మల్లయ్య అనే పేరు నాతో పాటు మా చిన్నాన్న, ఇతర కుటుంబసభ్యులకు కూడా ఉందని, వారి పేరిట ఉన్న భూమిని కూడా నాదేనని ఆరోపణలు చేయడం వారి అవివేకానికి నిదర్శమన్నారు. మరోసారి చెబుతున్న నాతో పాటు నా భార్య, ఇద్దరు కుమారుల పేరిట ఉన్న మా కష్టార్జితమైన భూమి 15 ఎకరాలే అని తేల్చి చెప్పారు. నాపై ఇష్టారీతిన భూకబ్జా ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

రాయికల్: మండలంలోని మూటపల్లి ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమవారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇమ్మనేని ప్రశాంత్‌రావు, గ్రామ అధ్యక్షుడు అలుపట్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు పూదరి వేణు, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తొగరి చిన్న, ఉపాధ్యక్షులు బెక్కెం రాకేశ్, పాఠశాల చైర్మన్ పందిరి వనిత, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18న మెట్‌పల్లిలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 18న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తెలిపారు. వచ్చే నెల 3,4తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేయడం కోసం ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అండర్–14,16,18,20 విభాగాల్లో వివిధ పోటీలు ఉంటాయని, ఆసక్తి గల వారు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ఆకట్టుకున్న వ్యవసాయ విద్యార్థుల ముగ్గులు

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్యార్థినులు వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. కోరుట్ల వ్యవసాయ విద్యార్థులకు స్వాగతం పలికేలా ఏర్పాటు చేసిన ముగ్గును వ్యవసాయ వర్సిటీ ఉన్నతాధికారులతో పాటు సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బాలికలకు కరాటే శిక్షణ


శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు

కథలాపూర్: బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నట్లు శిక్షకురాలు మౌనిక తెలిపారు. మండలంలోని సిరికొండలో జ్యోతివాణి పాఠశాలలో సోమవారం కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. వారంలో రెండు రోజులపాటు బాలికలకు కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం రాజేశ్ పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోరుట్ల: పట్టణంలోని భగవతీ విద్యాలయంలో 1 నుంచి 7 వ తరగతి వరకు చదువుకున్న 1989–1996 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.



జర్నలిస్టులకు గౌరవ వేతనం ఇవ్వాలి

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం చెల్లించాలని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముజాహిద్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ ఎండా, వాన ,చలిలో కూడా వార్తలు సేకరిస్తూ ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టుల కృషి మరువలేనిదన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టులకు భద్రతతో పాటు ప్రతీ నెలా కనీసం రూ. 5 వేల గౌరవ వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక లారీకి జరిమానా

ఇబ్రహీంపట్నం: పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి బండలింగాపూర్ చెక్‌పోస్టు వద్ద ఈ నెల 9న అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. లారీని ఎస్సై అనిల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు అప్పగించారు. తహసీల్దార్ వరప్రసాద్ సోమవారం రూ. 50వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.